హరేరామ - హరేకృష్ణ

బీడీ ముక్కలోంచి పారిపోతానని బెదిరిస్తున్న అగ్నిహోత్రుణ్ణి, 'బాబ్బాబు కాస్తుండు నీకు పుణ్యముంటుంది' అంటూ రామాచారి, పెదిమలు రెంటిని క్రిందికీ పైకీ ఊగిస్తూ బుజ్జగిస్తున్నాడు. పంటిసందులో యిరుక్కుని, అటూ యిటూ పోవడానికి వీల్లేకుండా, బీడి ఊగిసలాడుతోంది చూస్తూ చూస్తుండగానే, బీడీ రెండో చివర ఎర్రబడింది. అమ్మయ్య అని సంతృప్తిగా, రామాచారి, ఎడంచేత్తో, బీడీముక్కను, నోట్లోంచి తీసేసి, గర్వంగా పొగ ఊదుతున్నాడు. ఆయన ఆలోచనలన్నీ ఆ పొగలాగానే ఎగిరిపోతున్నాయి. చప్పున కుడిచేత్తో, పిలకను గట్టిగా పట్టుకుని, కసిగా లాగాడు, పీకేద్దామనే ఉద్దేశంతో 'కయ్' మని మళ్ళా వదిలేశాడు. మొహాన్న పంగనామాల్ని అరచేత్తో మర్దనం చేసి, సానలాగా మొహాన్ని తయారుచేశాడు. పళ్లు పటపటమనిపిస్తున్నాడు. తల వాచిపోతోంది. ఆ గంటలేమిటీ, ఆ మోగించట

మేమిటి, ఆ జనమేమిటి. తలచుకుంటే పిచ్చెత్తిపోతోంది అనుకున్నాడు.

'ఇంత తెలివి గలవాన్ని, నాకు రాగారాగా యీ పూజారి ఉద్యోగమా! నన్ను గుర్తించే వాళ్లెవ్వరూలేరు! ఇతరులకు నా సంగతెందుకు పడుతుంది. ప్రభుత్వమా అంటే, దానికి చెవులూ లేవు కళ్ళూలేవు యెంత మొత్తుకుంటే మాత్రం యేం ప్రయోజనం! అరెరె, యెంతమంది, యెంతమంది! యింతమంది భక్తుల కోరికలన్నీ తీర్చే, ఆ స్వామివారికి నామీద పక్షపాతం యెందుకో నాకర్థం కావటంలేదు. ఏదో వారానికి ఒకపూట అయితే వచ్చేసి, ఓ కొబ్బరికాయ, నాలుగు పూలు సమర్పించుకోగానే అడిగిన కోర్కెలన్నీ నెరవేరిపోయినట్టే, భక్తులందరూ, చేతులు జోడించి నమస్కరిస్తున్నారే. నేను ప్రొద్దస్తమానం ఆయన పాదాల దగ్గర పడుంటానే. అలాంటి నాకు, ఏ వరం ప్రసాదించడే, ఇంత చాకిరీ చేస్తే తీరా నాకు దక్కేది, కొబ్బరిముక్కలు, అరటి పళ్ళూనా! ఇంతేనా! అవును జీతం యిప్పిస్తున్నాడుగా, నూటయిరవై రూపాయలు! ఈ జీతం ఏ మూలకంట. పిల్లలకు పట్టు మని నాలుగుబట్టలు కుట్టించామంటే, రెండు మూడు నెలలదాక, ఆ దిగులుతో చావాల్సిందే! ఇహ నిత్యకృత్యం తిండి గడవటానికి పడేపాట్లకు అంతేలేవు ఛీ! పాడుబ్రతుకు. ఇంతకంటె.......'ఏదో లోపలే లోపలే గొణుక్కుని, ఎడంచేతి చూపుడువేలు చుర్రుమనంగానే, బీడీముక్కను లాగి నేలకేసి కొట్టాడు రామాచారి.

"మంచిపని చేశాన్లే, బాగానే శిక్ష అయింది....కొబ్బరికాయ భళ్ళున స్వామివారి పాదంమీదే పగలకొట్టాను. ఏదైనా చైతన్యం ఉన్నవాడవుతే ఆ దెబ్బకు అదిరిపడాల్సింది....ఆయనది రాతి

హృదయం. అసలు ఆయన రాయేగా ! భక్తుడెవరో, నేను చేసిన పనిని చూసినట్టున్నాడు. విలవిలలాడిపోయాడు, కందకు లేని దురద కత్తిపీటకున్నట్లు, వాడట్లా ఆడిపోయాడేమిటి పైగా నన్ను కసురుకోవటమా ! అపచారంట నేను పెద్ద అపచారం చేశానట! స్వామివారి పాదాన్ని గాయపరిచానట! నా కడుపుమంట ఆయనకేం తెలుస్తుంది. ఇన్నాళ్ళపట్టి ఆయన పాదాలు కడుగుతున్నానే, వళ్ళంతా రుద్ది శుభ్రం చేస్తున్నానే, రోజూ అలంకారం చేస్తున్నానే. ఇంతన్నా కృతజ్ఞత వుందా అంట ? ఈ వెట్టిచాకిరి యిహ నేను చెయ్యలేను. తీర్థప్రసాదాలు, ఊళ్ళోవాళ్ళందరికి ఇచ్చి, వాళ్ళం దరికి వరాలు యిప్పించి, నేను పస్తులుండలేను. ఇక భరించ లేను...." రామాచారి తెగ ఆయాస పడుతున్నాడు.

బిళ్ళగోచీ గట్టిగా బిగించేశాడు. ఊడిపోయిన గుండీలను చొక్కాకు గట్టిగా పెట్టేసి, తుండుగుడ్డను, తలకు బలంగా చుట్టుకొని ఒక్కసారి అమాంతం లేచి నిలబడ్డాడు. ఆయనకు యెక్కడ లేని ధైర్యం వచ్చినట్లనిపించింది. శరీరాన్ని పెంచుకున్నాడు.

ఈనాటితో నా దరిద్రం తీరిపోతుంది. ఇహ యివ్వాళనుంచి నేనే బాధలు పడనక్కర్లేద.... కృత నిశ్చయంతో ముందుకు అడుగులు వేశాడు.

అప్పుడే రోడ్లమీద జనం కిట కిట లాడుతున్నారు. రాత్రి తొమ్మిది గంటలు దాటింది. క్షణంలో జనం పల్చబడి పోయారు. చెదురువాటుగా, అక్కడో రిక్షా, అటో కారు. యిటో సైకిలు, ఒక ళ్ళిద్దరు మనుషులు కనిపిస్తున్నారు. రామాచారి, అట్టే పరికిస్తూ అట్లాగే నిలబడి చూస్తున్నాడు. పెద్దగా నిట్టూర్చి సూటిగా, తన

దేవాలయం వైపుకు వెళ్ళాడు చుట్టుప్రక్కల యెవ్వరూ లేరని రూఢీ చేసుకున్నాడు. ఆదుర్దాగా అటూ యిటూ చూస్తూ గభాలున తాళం తీసి, లోపలికి ప్రవేశించి తలుపులు రెండూ బిగించేశాడు. కాసేపటికల్లా మెల్లిగా తలుపులు తెరుచుకొని బైటకు వచ్చేసి, తాళం గట్టిగా వేసేసి, ధీమాగా యింటికి వెళ్ళిపోయాడు,

ఇంట్లో పతివ్రతా శిరోమణి అనసూయా దేవి, భర్తరాక కోసం నిరీక్షిస్తూ, భగవన్నామ స్మరణలో లీనమయి వుంది.

'ఇంత రాత్రిదాక యెక్కడున్నారండి...' కాస్తంత పెద్ద గొంతుకతోనే భర్తను చూడంగానే, అమాంతం అనేసింది.

గభాలున రామాచారి, భార్యనోరు నొక్కేసి, గట్టిగా అరవ వద్దని సంజ్ఞచేసి, లోపలికి వెళ్ళిపోయాడు.

కృష్ణ కృష్ణ !...'ఏమిటీమాయ....'రాధాకృష్ణుల విగ్రహానికి, రెండు చేతులూ జోడించి నమస్కారం చేసింది అనసూయ.

ఒహో అదా సంగతి అన్నట్టు తలవూపి గబగబ భర్త దగ్గరకు వెళ్ళింది, క్షణంలో.

"ఏం చేశారు యివ్వాళ, ఇంత అర్ధరాత్రి దాక యెక్క డున్నట్టు చెప్పండి ! చెపుతారా లేకపోతే, నా కృష్ణున్నడిగి మీ గుట్టు బైట పెట్టమంటారా !" అనసూయ యెంతో విశ్వాసంతో ప్రశ్నించింది.

'నా కర్మకొద్దీ, యీ పిచ్చిదాంతో కాపురం చెయ్యాలిసి వచ్చింది' అని లోపల అనుకుని, తల బాదుకుంటూ, "నేను చెప్తా రా" ! అంటూ, రామాచారి తుండుగుడ్డ విప్పతీసి, తాను తెచ్చిన వస్తువ్ని చూపించాడు.

"ఆ ! హా !..." అంటూ మూర్ఛపోయింది అనసూయ.

'ఇదెక్కడి కర్మరా ! అని ఆయాసపడుతూ, గదిలోంచి అమాంతం బైటకు వచ్చేసరికి, పిల్లలిద్దరూ, చెరొకవైపు నిలబడి వున్నారు.

"మీరు యెంతసేపటి నుంచి యిక్కడున్నారేమిటి !...." కసురుకుంటూ, ముందుకు రెండడుగులు వేసి, గ్లాసెడు నీళ్ళు తెచ్చి, అనసూయ మొహాన చల్లాడు. కనురెప్పలు టపటపమనిపిస్తూ మెల్లిగా లేచి, 'ఆర్తరక్షణా, పరాత్పరా ! హే కృష్ణా ! నా భర్తను క్షమించు ! అపచారాన్ని మన్నించు...' అంటూ ఆవేదన పడు తోంది.

రామాచారికి మతిపోయినట్లయింది. ఆ సమయాన, యేం చెయ్యాలో అర్థంకాక తికమక పడిపోయాడు. తాను తెచ్చిన నగల్ని చప్పున పెట్టెలో పెట్టేసి, చివాలున అనసూయ చెయ్యి పట్టుకుని లేవతీసి. నీకో మాట చెప్తారా ! అట్టే గోలచెయ్యక, ఎవరన్నా విన్నా, అప్రదిష్ట. ఏమిటి యీ అర్ధరాత్రి యీ రభ సంతా ! .." అంటూ ఆరాటపడ్డాడు.

అనసూయ ఓ పట్టాన వినిపించుకోలేదు. ఆమె ధోరణిలోనే వుండిపోయింది. రామాచారి ఆమెను శాంతపరచి నచ్చ చెప్ప టానికి ప్రయత్నించాడు.

ఏంలాభం లేకపోయింది. ఎన్ని విధాల చెప్పినా ఆమె ఒప్పుకోవటం లేదు.

"భక్తుల్నే భగవంతుడు పరీక్ష చేస్తాడు. తాను ఉన్నాడని ఋజువు చెయ్యటం ఎలాగనుకున్నారు. ఇలాంటి కష్టాలు వచ్చి నప్పుడే నిబ్బరంగా వుంటూ మనం ఆయన్నే ధ్యానం చెయ్యాలి.

ఆయన యందే విశ్వాసముంచాలి నమ్మినవాళ్ళకు ద్రోహం యెన్నడూ ఆ పరాత్పరుడు చెయ్యడు. నిత్యమూ ఆ భగవంతుని సన్నిధిలోనే వుంటూ, ఆయన్ను ధ్యానిస్తూ ఆయన కరుణా కటాక్షాలకు పాత్రులయ్యారు. మీ జీవితం ధన్యం మీరెంత పుణ్యాత్ములో మీకు తెలియదు. మీ సహధర్మచారిణి అయినందుకు నేనెంతో గర్వపడుతున్నాను. మీరు యిలాంటి పనులు చెయ్యకూడదు... మీరు ఆ నగలు స్వామివారికి యిచ్చి, తప్పు మన్నించమని వేడుకొండి, మిమ్మల్ని తప్పక కటాక్షిస్తాడు. కరుణా సముద్రుడు. హరేకృష్ణ, హరేరామ, రామరామ హరేహరే....'' మొదలుపెట్టింది అనసూయాదేవి.

అందుకున్నారు పిల్లలందరూ కృష్ణ కృష్ణ హరేహరే అనుకుంటూ.

రామాచారి, జుట్టు పీక్కున్నాడు. పిల్లలందర్ని ఒక్కొక్క గొంతుకే పట్టుకుని, వీధి గుమ్మంలోంచి వాకిట్లోకి గిరాటు పెడదామన్నంత కోపం, కసీ వచ్చినాయి. అయితే అంత ధైర్యమూ లేదు. బలం అంతకంటె లేదు. చప్పబడిపోయాడు. ఆ ధ్వని వినలేక, చెవులు రెండు గట్టిగా మూసుకున్నాడు.

తెల్లవార్లు నిద్రలు లేవు. చుట్టుప్రక్కల వారికయితె దీనికి బాగానే అలవాటు పడిపోయారు. ఒకాయన సీరియస్‌గా ఓసారి 'న్యూసెన్స్' కేసు ఒకటి పడేశాడు. అయితే ఆ కేసు కొట్టేశాడు న్యాయమూర్తి. మత స్వాతంత్ర్యాన్ని అరికట్టటం, ప్రాథమిక సూత్రాలకు హక్కులకు భంగకరమని, దాంతో ఆ యిల్లు ఖాళీచేసి వెళ్ళిపోయాడు ఆ పెద్దమనిషి. ఇంకో ఆయనకు మతిపోయి, వెళ్ళాల్సిన చోటుకే చేరుకున్నాడు. ఇహ మిగిలిన ఇరుగు పొరుగు

వారు, అప్పుడప్పుడు యిక్కడే మకాంపెట్టి, చిరతలు పట్టుకుంటూ వుంటారు. అందువల్లనే యీరోజు కూడా, అనసూయా దేవిగార్కి భగవంతుడు సాక్షాత్కరించాడనీ, వాళ్ళు ఊహించుకున్నారు. అందుకనే యే గొడవా లేకుండా తెల్లారిపోయింది.

భర్తకు ఊదరపెట్టేస్తోంది. ముందు వెళ్ళి ఆ నగలు యిచ్చి క్షమాపణ చెప్పుకోమని. రామాచారి అట్టే ఆలోచిస్తున్నాడు యేం చెయ్యటమా అని.

'...మీరట్లా అనుకోవద్దు. ఆ సర్వేశ్వరుడి మీద విశ్వాసం వుంచండి. ఆయనే మనల్నందర్నీ కాపాడుతాడు. తాత్కాలిక ఉపద్రవాల్తో, మీ విశ్వాసాన్ని సడలనీయకండి...' అక్కడే మనం దెబ్బతింటున్నాం. మన నమ్మకమే మనల్ని కాపాడుతుంది.... హరేకృష్ణ....మళ్ళీ ప్రారంభమయింది.

మధ్యాహ్నం దాకా యెట్లాగో దాటేశాడు. కాని యిహ సాధ్యం కావటం లేదు. భార్యపోరు యెక్కువయి పోతోంది. తనకు ఇంట్లో మంచి మద్దతు వుంటే తాను చేసినపనిని కప్పి పుచ్చుకోవ టానికి యింకోళ్ళమీద తోసెయ్యటానికీ, తాను వేసిన పథకం పారేదే. కాని జారిపోతున్నాడు. మళ్ళీ క్షణంలో ధైర్యాన్ని వుంజుకుంటున్నాడు. ఏమైనా సరే అనుకుంటూ, ఎంతో ధీమాగా శరీరాన్ని పెంచుకుంటున్నాడు. ఇహ యింట్లో వుంటే లాభం లేదనుకున్నాడు.

"సరే నువ్వు చెప్పినట్టే చేస్తాను అవి అక్కడే పెట్టేవస్తాన్లే...." అంటూ రామాచారి, ఆ నగల్ని, తుండుగుడ్డలో చుట్టేసుకుని, ఒక్క అంగలో గుమ్మం దాటేశాడు. అటూ యిటూ బిత్తర చూపులు

చూస్తూ, సూటిగా దేవాలయం వైపుకు నడిచాడు. భర్త దేవాలయం దాకా వెళ్ళటం చూసి అనసూయ గభాలున లోపలికి వచ్చి రాధా కృష్ణుల విగ్రహాలను కన్నీళ్ళతో అభిషేకం చేసింది. క్షమించమని ప్రాధేయపడింది.

ఇంతలోకి రామాచారి అక్కడకు వెళ్ళినట్లే వెళ్ళి, ఆ తుండు గుడ్డ మూటను రాస్తా తన స్నేహితునికిచ్చేసి, దాటెయ్యమని సంజ్ఞ చేశాడు. ఆయన మాత్రం సూటిగా గుళ్ళోకి వెళ్ళి, స్వామివారి పాదాలమీద పడి "స్వామీ నామీద నాకు విశ్వాసం కలుగచెయ్యి" అంటూ బిగ్గరగా ఏడ్చాడు.

మెల్లి మెల్లిగా గుటకలు వేస్తూ, కళ్ళు తుడుచుకుంటూ లేచి నిలబడ్డాడు యెంతో బరువుగా. తెగ ఆయాస పడుతున్నాడు. కళ్ళు మూస్తూ తెరుస్తూ, యిట్టె ఒక్క అంగలో బైటకు వచ్చేశాడు. యెవరో హఠాత్తుగా వచ్చి నెట్టేసినట్లు.

'రామాచారి యెవరిక్కడ' అంటూ ఖంగున అడిగారు, అప్పుడే అక్కడకు వచ్చిన పోలీసు లిద్దరూను.

—o—